# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రజా కళా రూపాలకు ప్రాచుర్యం కల్పించి వర్ధమాన కళాకారులందరిని ఒకే వేదిక పైకి తీసుకురావడమే ప్రాజెక్టు పరి ముఖ్య ఉద్దేశ్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- భారతదేశంలో పులుల సంఖ్య పెరగడంతో పాటు అటవీ ప్రాంతం కూడా వేగంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

- వివిధ ప్రాజెక్టుల రూపంలో రాష్ట్రానికి 80 వేల కోట్ల రూపాయల నిధులు రానున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.

- గోదావరి వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెం నాయుడు స్పష్టం చేశారు..

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజా కళా రూపాలకు ప్రాచుర్యం కల్పించి వర్ధమాన కళాకారుల్ని ఒకే వేదిక పైకి తీసుకురావడమే ప్రాజెక్టు PARI (Public Art in India) ముఖ్య ఉద్దేశ్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు “మన్ కీ బాత్” 112వ సంచికలో దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... ఏ దేశమైన తమ వారసత్వ సంపదను ముందుకు తీసుకెళితేనే అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. రహదారుల పక్కన, గోడలపై చాలా అందమైన పెయింటింగ్స్ కనిపిస్తుంటాయి. ఈ కళాఖండాలు మన దేశ కళాకారులు రూపొందించినవే. ఇవి మన సంస్కృతికి మరింత ప్రాచుర్యం పెంచుతాయన్నారు. ఇటువంటి కళా ప్రియులు, సంస్కృతి ప్రేమికులు పబ్లిక్ ఆర్ట్‌పై మరింత కృషి చేయాలని ప్రధాన మంత్రి కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ‘ఏక్ పేడ్ మా కే నామ్’ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కొద్ది రోజుల క్రితం ఈ కార్యక్రమంలో భాగంగా ఒకే రోజు 2 లక్షలకు పైగా మొక్కలు నాటారని గుర్తు చేశారు. మీరు కూడా మీ అమ్మ పేరు మీద మొక్కలు నాటే ఈ ఉద్యమంలో పాల్గొని సెల్ఫీ తీసుకుని సామాజిక మాధ్యమంలో పోస్టు చేయాలన్నారు. ఈ ఉద్యమంలో చేరడం ద్వారా, మీరు మీ అమ్మ కోసం, మాతృభూమి కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయాలని భావిస్తారని ప్రధాన మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో పులుల సంఖ్య పెరగడంతో పాటు అటవీ ప్రాంతం కూడా వేగంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పులులు మన సంస్కృతిలో అంతర్భాగమని ప్రపంచంలోని 70 శాతం పులులు దేశంలోనే ఉన్నాయన్నారు. అయితే పులుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం చాలా సహాయపడుతున్నందుకు సంతోషంగా ఉందని, ఇలాంటి ప్రయత్నాల వల్ల భారతదేశంలో పులుల సంఖ్య ఏటా పెరుగుతోందని తెలిపారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల కొండలపై నివసించే చెంచు తెగకు చెందిన గిరిజనుల కృషిని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో గిరిజనులు టైగర్ ట్రాకర్లుగా ఉండి అడవిలో వన్యప్రాణుల సంచారం గురించి ప్రతి సమాచారాన్ని సేకరించి అధికారులకి తెలియజేస్తారని వివరిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

పారిస్ ఒలింపిక్స్ లో ప్రపంచ వేదికపై భారత పతాకాన్ని రెపరెలాడించే అరుదైన అవకాశం మన దేశ క్రీడాకారులకి ఉందని, వారిని కచ్చితంగా మనం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అలాగే ఇటీవల ఇంగ్లాండ్ లో జరిగిన అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్-2024లో పతకాలు సాధించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి అభినందించారు. అలాగే మరికొద్ది రోజుల్లో రానున్న ఆగస్టు 15వ తేదీని పురస్కరించుకొని “హర్ ఘర్ తిరంగా” అభియాన్ లో ఉత్సాహంగా ప్రతీ ఒక్కరూ పాల్గొనాలనీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ ప్రాజెక్టుల రూపంలో రాష్ట్రానికి 80 వేల కోట్ల రూపాయల నిధులు రానున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. గుంటూరులో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అమరావతికి 2 వేల 500 కోట్ల రూపాయలతో రైల్వే లైన్ మంజూరైందని అన్నారు. 12 వేల కోట్ల రూపాయల నుంచి 15 వేల కోట్ల రూపాయల విలువైన అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని, దీనికి అవసరమైన భూ సేకరణకు కేంద్రం సహకరిస్తోందని అన్నారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా చేర్చి, ఆయా జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇస్తోందన్నారు. రాష్ట్రానికి రెండు పారిశ్రామిక కారిడార్లు రానున్నాయని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎర్ర కాలువ వరద ఉధృతి వలన ప్రతి సంవత్సరం వేలాది ఎకరాలు పంట ముంపుకు గురవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెం నాయుడు అన్నారు. ఈరోజు మంత్రులు అచ్చం నాయుడు, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్ తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చం నాయుడు మాట్లాడుతూ... ఎర్ర కాలువ ముంపు ప్రభావం జంగారెడ్డిగూడెంలో మొదలై భీమవరం శివారు వరకు ఉంటుందని, దీని వలన 20 మండలాల్లోని గ్రామాల్లో చేతికొచ్చిన పంట మునిగిపోయి నష్టం జరుగుతుందన్నారు. ఎర్రకాలువ ముంపు నివారణకు తక్షణ చర్యలు చేపట్టడంతో పాటూ... శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆధునికరణ పనులు చేపట్టి, ముంపు నివారణను అరికట్టడం జరుగుతుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భావి తరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. కొన్ని ప్రభుత్వ పథకాల పేర్లు మార్పుకి సంబంధించిన ఉత్తర్వులపై ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... పాఠశాల విద్యార్థులకు ఇచ్చే “విద్యా పథకా”న్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం సముచితమన్నారు. “మధ్యాహ్న భోజన పథకా”నికి అపర అన్నపూర్ణ

డొక్కా సీతమ్మ గారి పేరును పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం గారి పేరుతో విద్యార్థులకు "ప్రతిభా పురస్కారాలు" అందించడం యువతలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుందని అన్నారు. ఆ మహనీయుల ఆశీస్సులు ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ విజయ ప్రస్థానం ప్రారంభమయ్యింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్ లో మను బాకర్ కాంస్య పతకం సాధించింది. దీంతో ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళగా మను బాకర్ నిలిచింది. మరోవైపు మహిళల 10 మీటర్ల రైఫిల్ షూటింగ్ విభాగంలో భారత క్రీడాకారిణి రమిత ఫైనల్‌కు చేరుకుంది. అలాగే తొలిసారి ఒలింపిక్స్ లో పాల్గొంటున్న భారత బాక్సర్ నిఖత్ జరీన్ ప్రారంభ మ్యాచ్ లో విజయం సాధించి మహిళల 50 కేజీల విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలపై గోదావరి వరద ప్రవాహం తీవ్ర ప్రభావం చూపుతోంది. నిన్న సాయంత్రం 4 గంటలకు భద్రాచలం వద్ద నీటి ప్రవాహం 53.03 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే ఎగువ ప్రాంతంలో వరద తగ్గుముఖం పట్టడంతో అర్ధరాత్రి నుంచి మళ్లీ వరద ప్రవాహం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయని జల వనరుల శాఖాధికారులు తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి, సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి, పోలీసు సూపరింటెండెంట్ ప్రతాప్ శివ కిశోర్‌లు అధికారులతో సమావేశమై రెండు మండలాల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వరద ఇంకా పెరిగితే ముంపు గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాకినాడ జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. జిల్లాలోని గండేపల్లి మండలం మురారి వద్ద ఈరోజు తెల్లవారుజామున రోడ్డుపై అదుపుతప్పి పడిపోయిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =